నీలినీడ

వాణిశ్రీ

బాస్‌తోపాటు కారు దిగి ఆఫీసులోకి ఆయన వెనుకే అడుగులు వేస్తున్నాను.

సాధారణంగా ఆయన తలవంచుకుని విష్‌చేసిన వాళ్ళని గమనించీ గమనించనట్టుగా చరచరా నడిచి వెళ్ళిపోతాడు. ఎప్పుడో ఒకసారి తలెత్తి తను రాగానే లేచి నిల్చుని విష్‌చేస్తున్న స్టాఫ్‌వంక చూస్తారు. అప్పుడాయన పెదవులపై సన్నగా చిరునవ్వు కదులుతుంది.

ఆయన తలెత్తి చూసినప్పుడు ఎపుడో ఒకసారి కృష్ణ కనిపించక మానదు అని నేను భయపడుతున్నాను. కనిపిస్తే ఏం జరుగుతుందో నాకు తెలుసు.

బాస్‌వి పాపిష్ఠి కళ్ళు.

ఆ చూపుల్లోని విషపు గాలికి కృష్ణ మలినమైపోతుంది.

అలా జరగ్గూడదని కోరుకుంటున్నాను.

రోజూ బాస్ వెనుకే నడుస్తున్నప్పుడు నా గుండె వేగంగా కొట్టుకుంటుంది ఆ చప్పుడు నా చెవులకు వింతగా వినిపిస్తూ వుంటుంది.

బాస్ ఏ.సి. రూమ్‌లోకెళ్ళి తనసీట్లో కూర్చున్నప్పుడు నా ప్రాణం కుదుటపడుతుంది

'హమ్మయ్య. గండం గడిచింది' అనుకుంటాను గట్టిగా గాలి పీల్చి.

కృష్ణ బాస్ కళ్ళపడగూడదని కోరుకోవడానికొక కారణం వుంది.

నేను ఆమెను ప్రేమిస్తున్నాను. పెళ్ళిచేసుకోవాలని కలలు గంటున్నాను.

కాని కృష్ణ ఇంటి పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు తల్లి లేదు. సవతి తల్లి. ఆమెను చూసినప్పుడు నాకు టున్.... టున్.... జ్ఞాపకం వస్తుంది. ఇక ఆమె తండ్రి వేదాంతిలా ఇంటి సంగతే పట్టించుకోడు. కృష్ణ పెళ్ళీడు కొచ్చిందనీ పెళ్ళి చెయ్యాలనే ఆలోచనే లేదు. జీతం డబ్బులు తెచ్చి పెళ్ళాం

దోసిట్లో పోస్తారు. ఇక ఆవిడ తన పిల్లల్ని చూసుకుంటుంది గాని సవతి కూతురు సంగతి ఆలోచించదు.

ఒక రకంగా నేనూ ఒక్కుడ్నే లేని వాణ్ణి వాళు ముందూ వెనుకా ఎవరూ లేరు. కృష్ణని ప్రేమించడం..... అదంతా ఒక విచిత్రమైన సంఘటన. అదంతా ఇప్పుడెందుకు లెండి.

ఆమెను పెళ్ళిచేసుకోవాలని ఆమె తండ్రి శంకరయ్యను ఆఫీసు దగ్గర కలుసుకున్నాను. ఆయన పి. డబ్ల్యూ. డి. ఆఫీసులో గుమస్తా.

నేను చెప్పిందంతా విని "నాదేం వుంది వాళ్ళమ్మ ఇష్టం," అని చేతులు దులుపుకున్నాడు.

శంకరయ్య మాటలు, చేష్టలు విని త్రంగా కోపాయి.

వేలకు వేలు కట్నాలు పోసి, వియ్యాలవారి గొంతెమ్మ కోర్కెలు తీరుస్తుంటేనే ఆడపిల్ల పెళ్ళి కావడం గగనమైపోతున్న ఈ రోజుల్లో, నగరంలోని పెద్ద కంపెనీలో బాస్‌కి పెకెటరీగా ఉద్యోగం చేస్తున్న హోదాలో పెళ్ళి పిల్లని అడిగితే ఎగిరి గంతేయ్యాల్సింది పోయి 'అంతా వాళ్ళమ్మ ఇష్టం' అంటాడేమిటి?

ఇటువంటి వాళ్ళ గురించే మా మురళి గాడు 'హెన్ పెక్‌డ్ హస్బెండ్స్' అనేవాడు.

శంకరయ్య అద్భుతంగా అటువంటి మనిషే.

ఆయన సమాధానం విని నాకు మండెక్కిపోయింది.

ఆ సాయంకాలం పార్కులో కృష్ణని కలుసుకుని "ఇలా లాభం లేదు. రిజిష్టర్ మ్యారేజి చేసుకుందాం. వాళ్ళ తిక్క కుదురుతుంది," అన్నాను.

"అలా చేస్తే మా పిన్ని జీవితాంతం నన్ను తిడుతూనే వుంటుంది. మా పిన్నిని అడగడానికి భయం అయితే ఎవర్నయినా రాయబారం పంపించు. చూద్దాం ఏమంటుందో!" అంది కృష్ణ నవ్వుతూ.

అలాగే సుబ్బారాయుడిని పంపించాను.

నేను వాళ్ళింటికి దగ్గర్లోనే ఒక హోటల్లో వెయిట్ చేస్తూ కూర్చున్నాను.

అరగంట తర్వాత వాడు రొప్పుకుంటూ వచ్చి మూడు గ్లాసుల మంచినీళ్ళు ఏకబిగిన త్రాగేసి "నీకు ఆ పిల్లతో పెళ్ళి కాదురా," అన్నాడు.

"ఏం?" అని ప్రశ్నించాను నిర్ఘాంతపోతూ.

"వాళ్ళ పిన్ని ఆ పిల్ల పెళ్ళి చేసేట్టు లేదు," అన్నాడు.

"సరిగ్గా చెప్పేదువు!" అని విసుక్కున్నాను.

'ఆయన తెచ్చే జీతం తినడానికే చాలటం లేదు. ఇక పెళ్ళి ఎలా చెయ్యను? ఆడపిల్లంటే మాటలా

నాయనా ! కట్నాలు, కానుకలూ పెళ్ళి ఖర్చులు తడిసి మోపెడవుతాయి,' అని మొకలు పెట్టింది.

"మా వాడికి పెళ్ళి చేస్తే చాలు. కట్నాలూ, కానుకలూ.... అక్కర్లేదు." అన్నాను.

"పోనీ పెళ్ళి ఖర్చులకు కావాలి గదా ! అవి ఎక్కడ్నుంచి తేవాలి? ఇప్పటికే ఆయన జి.పి.యఫ్ ... ఫెస్టివల్ అడ్వాన్స్లు, ఇంటికోసం అంటూ అన్నీ లోన్లూ తీసుకున్నారు." అంది.

"పోనీ పెళ్ళి ఖర్చులు గూడా మా వాడే భరిస్తాడు లెండి...." అన్నానో లేదో ఆమె తాటకిలా ఇంతెత్తున ఎగిరి పడిందిరా ! ఏవయ్యోవ్ మర్యాదగా మాట్లాడు.... మేమేమీ అంత గతిలేని వాళ్ళ మనుకున్నారా? ఏదో రోజులు బాగోక మా పరిస్థితి యిలా వుంది గానీ. మా ఆయనకి సెలక్షన్ గ్రేడు వస్తుంది.... దాంతో పదివేలు ఎరియర్స్ వస్తాయి. అప్పుడు చేస్తాం పెళ్ళి. ఈ లోపల మా అమ్మాయికి ఏదొక వుద్యోగం వస్తుంది. దాని డబ్బులు ఒక సంవత్సరం బ్యాంకిలో వేసినా ఇట్టే పెళ్ళి చెయ్యొచ్చు.... అంటూ లౌడ్ స్పీకర్లో స్విచ్చిలా తగులుకుంది."

సుబ్బారాయుడి మాటలు విని నాకు నీరసం ముంచుకొచ్చింది.

'అందుకని ఒరేయ్ ఆ కృష్ణతో పెళ్ళి జరుగుతుందని కలలు కనకు వాళ్ళ నాన్నకి సెక్షలన్ గ్రేడ్ ఎప్పుడొస్తుందో, కృష్ణకి వుద్యోగం ఎప్పుడొస్తుందో దేవుడు గూడా చెప్పలేడు,' అని తీర్మానించాడు సుబ్బారాయుడు.

నాకు పిచ్చెక్కిపోయేట్లుంది అదంతా వింటూ వుంటే. ఇప్పటికే ప్రేమ ముదిరి పోయి నా బుర్రంతా ఖరాబయింది. పెళ్ళయితే తప్ప వంటిమీద చెయ్యి వెయ్యడానికి గూడా వీల్లేదని కృష్ణ మొకచే షరతు పెట్టింది. అరచేతిలో లడ్డూ పెట్టుకుని తినడానికి నోచుకోలేదు నా బ్రతుకు.

నేను దిగులు పడి చస్తూవుంటే సుబ్బారాయుడే సలహా ఇచ్చాడు మీ కంపెనీలో కృష్ణకు ఏదైనా వుద్యోగం ఇప్పించమని. అప్పుడు పనిచేసింది నా బుర్ర. బాస్కి సెక్రటరీనైన నాకు ఎంతో కొంత పలుకుబడి వుంది కంపెనీలో. అందుకే బాస్కి తెలియకుండా కృష్ణకి వుద్యోగం వేయించాను.

ఇప్పటికి వారమైంది కృష్ణ కంపెనీలో జేరి. అప్పట్నుంచే నాకు దిగులు మొదలైంది కృష్ణ బాస్కళ్ళలో పడుతుందో ఏమోనని.

ఆ రోజు నా భయం నిజమైంది.

బాస్ కళ్ళు కృష్ణమీద పడ్డాయి.

కృష్ణ ఆకుపచ్చ దుస్తుల్లో వనకన్యలా ధగధగలాడి పోతూవుంది. ఆమె కళ్ళు

చుక్కల్లా తళతళా మెరిసిపోతూ వున్నాయి. ఆమె చెక్కిళ్ళలో పారుతున్న రక్తం, ఆమె పెదవుల్లో నాట్యం చేస్తున్న విద్యుత్తు.... ఓష్! అందాల రాణి పోటీలో గెలుపొందిన విజేతలా విల్చేవి వుంది.

బాస్ కళ్ళు ఆమెపై విల్చిపోయాయి.

కృష్ణ అందం బాస్‌ని అడుగు ముందుకు పడకుండా చేసిందని అందరూ లోలోపలే వూహించారు.

తర్వాత బాస్ తేరుకున్నాడు. తల వంచుకుని తన ఏ.సి. రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

నా గుండె గుభేలుమంది.

అనుకున్నంతా అయ్యింది.

బాస్....ఆ దుర్మార్గుడు .... కృష్ణను వలలో వేసుకోడానికి ప్రయత్నిస్తాడు. లేకపోతే వుద్యోగం పీకించివేస్తానని బెదిరిస్తాడు. నాకు తెలుసు వాడి పద్ధతులన్నీ....వీల్లేదు ... కృష్ణని వాడి కబంధహస్తాల్లో చిక్కుకోనియ్యకూడదు.

నా రక్తం మరిగిపోతోంది, ఇవన్నీ తల్చుకుంటూ వుంటే.

బాస్ సీట్లో కూర్చున్నాడు మగతగా.

ఈ లోకంలో లేనివాడిలా పిచ్చిచూపులు చూస్తున్నాడు.

నేను ఫైలు పట్టుకుని నిల్చున్నాను. ముఖ్యమైన లెటర్స్ అర్జెంటుగా సంత కాలు పెట్టి పంపాలి

కాని ఆయనగారు నా వంక చూడ్డమే లేదు.

బజ్జర్ నొక్కాడు.

జవాన్ వచ్చాడు. ఆజ్ఞ అన్నట్లు తలవంచి నిల్చున్నాడు

"ఆ .... అమ్మాయిని పిలువు!" అన్నాడు

జవానుకి అర్థంకాలేదు 'ఆ అమ్మాయి ఎవరో.' ఎందరో అమ్మాయిలు వున్నారు మా స్టాఫ్‌లో.

"ఎవరు సార్!" ప్రశ్నించాడు జవాన్.

"రాణా!"

"సార్!" అన్నాను వినయంగా.

"ఆ .... అమ్మాయి ఎవరు? అదే ఆకుపచ్చ డ్రెస్‌లో వుంది చూడు. క్రొత్తగా వచ్చిందనుకుంటాను..." అన్నాడు.

"ఆ అమ్మాయా! .... కృష్ణ సార్! కృష్ణ..." గొణుక్కుంటున్నట్లు అన్నాను.

"యస్! కృష్ణని పిలువు" అన్నాడు

తర్వాత నా చేతిలో ఫైలు తీసుకుని గబగబా సంతకాలు పెట్టి ఇచ్చాడు. అంటే ఇక నువ్వు దయచెయ్యి మహాను భావా అని అర్థమే.

వంటికి కారం పూసుకున్న వాడిలా మండిపోతూ గది బైటకు నడిచి నా సీట్లో కూర్చున్నాను.

నా కళ్ళముందే కృష్ణ బాస్ గదిలోకి వెళ్ళింది.

తలుపులు మూసుకున్నాయి.

తర్వాత జవాను రెండు కూల్‌డ్రింకు సీసాలు ట్రేలో పట్టుకెళ్ళడం చూసి నాకు విషం త్రాగా లనిపించింది.

కృష్ణ బాస్ గదిలో గంటవరకూ వుంది.

'గంటసేపు ఏం మాట్లాడుకుంటారు?'

తెలుసుకోవాలనే తహ తహ .... ఆఫీసు టైమ్ ఎప్పుడవుతుందో! బాస్ క్లబ్బుకి ఎప్పుడు పోతాడో .... కృష్ణని అడగాలి. ఏం మాట్లాడాడో!

"గంటసేపు ఏం మాట్లాడాడు వాడు?" గుర్రుగా అడిగిన నన్ను చూసి కృష్ణ పకపక నవ్వింది.

పార్కులో జనం అంతగా లేరు. ఐదింటికే ఎవరొస్తారు?

"ఎందుకు నవ్వుతావు? ...."

"నవ్వక ఏడవనా? మాట్లాడినవన్నీ ఎలా గుర్తుంటాయి? ఏదో అడిగాడు ఇంటర్వ్యూలా! జాబ్ వచ్చాక అడుగు తున్నాడెందుకు వెధవ ప్రశ్నలు!" నవ్వింది కృష్ణ.

"అన్నీ వెధవ ప్రశ్నలేనా? అంటే పెళ్ళి....?"

"ఛీ...." అని ముఖం చిట్లించింది కృష్ణ.

"వాడుట్టి దుర్మార్గుడు. అన్నీ వెధవ బుద్ధులూను! ఆడది కనిపిస్తే చాలు వెర్రెత్తిపోతాడు. పట్టి రావణాసురుడనుకో! నీకు తెలియదేమో వాడికి పెళ్ళి పెటాకులూ లేవు. ఇలా అర్థమైన తిరుగుళ్ళు తిరుగుతూ వుంటాడు." బాస్‌మీద అన్నీ చెప్పేశాను.

కృష్ణ పకపకా నవ్వుతోంది నా అసూయ చూసి.

"ఎందుకూ అలా నవ్వుతావు ఎవరైనా వింటారు." చిరుకోపం ప్రదర్శించాను.

"రావణాసురుడికి పెళ్ళయింది. పెళ్ళి కాని రాక్షసుడి పేరు పెట్టు మీ బాస్‌కి." నవ్వింది కృష్ణ.

"చాల్లే నీ తెలివి." మొట్టికాయ వేశాను.

* * *

నేను భయపడుతున్నట్లే జరుగుతోంది.

బాస్ కృష్ణమీద అమితమైన శ్రద్ధ చూపిస్తున్నాడు.

రెండు నెలలకే ప్రమోషన్ ఇచ్చి కంపెనీలో కీలకమైన స్థానం కల్పించాడు.

"సార్! రెండు నెలలకే మీరు ఆమెకు ప్రమోషన్ ఇవ్వడం అన్యాయం" అన్నాను ఒకరోజు.

బాస్ కళ్ళెర్రజేసి చూశాడు.

నాకు భయం వేసింది ఆ రూపం చూస్తే.

"అది నా ఉద్దేశ్యం కాదు సార్! స్టాఫ్ అనుకుంటున్నారు." తడబడుతూ అన్నాడు.

"నా ఇష్టం. ఇది నా కంపెనీ. నా ఇష్టప్రకారం ప్రమోషన్ ఇస్తాను. ఎవడు కాదనేది?...." గర్జించినట్లు అన్నాడు.

నేను నోరు మూసుకున్నాను ఆ దెబ్బతో.

"ప్రమోషన్‌కి సర్వీసు కాదు ముఖ్యం. టాలెంట్. టాలెంట్ వున్న వాడికివ్వాలి ప్రమోషన్...."

బాస్ పరోక్షంగా తిట్టాడు నన్నే. మరి నేనేగదా ఆయన్ని విమర్శించింది.

బాస్‌కి తాగుడు ఎక్కువైంది. ఎందుకో నాకు అర్థంకావడం లేదు.

కొన్నాళ్టికి అర్థమైంది. కృష్ణ ఆయన దారికి రావడం లేదు. ప్రమోషన్ ఇచ్చినా లొంగలేదు. అందుకే ఆయన గారికి దిగులు.

నాకు చాలా సంతోషం వేసింది. గర్వం కలిగింది. డబ్బుకు హోదాకు లొంగని ప్రేమమయి కృష్ణ నాదైనందుకు నా జీవితానికి ఈ తృప్తి చాలు హాయిగా కాలం వెళ్ళబుచ్చడానికి.

ఒకరోజు పిడుగులాంటి వార్త విన్నాను.

బాస్ నన్ను పిలిచి కృష్ణను వుద్యోగం నుంచి తొలగించమని చెప్పాడు.

నేను ఆశ్చర్యపోయాను. ఇదేమిటి అనుకోకుండా ఇలా జరిగిందని మధన పడ్డాను. కృష్ణ ఇంకా కొన్నాళ్ళు వుద్యోగం చేస్తే బాగుంటుంది. పెళ్ళికి ఏ ఆటంకమూ లేకుండా జరిగిపోయేది. పెళ్ళి ఖర్చులకు సరిపోయే డబ్బు కృష్ణ సంపాదించుకో గలిగేది. ఆమె [illegible] అడ్డుపెట్టేది కాదు మా పెళ్ళికి ఇప్పుడెలా?

నేను బాస్‌కి నచ్చజెప్పాలని అనుకున్నాను. కాని ఆయన నా ముఖం చూడ్డమే లేదు. ఉదోలా వున్నాడు. కళాకాంతులూ లేవు. ఏం జరిగిందో మరి?

నాకు ఏం చెప్పడానికీ గొంతు పెగల్లేదు. గంగిరెద్దులా తలవూపి బైట పడ్డాను.

కృష్ణను విజిటర్స్ రూమ్‌లోకి తీసుకెళ్ళి సంగతి చెప్పాను.

"నాకు తెలుసు ఇలా జరుగుతుందని...." అంది కృష్ణ.

నేను నివ్వెరపోయాను. అయితే ఏదో జరగకూడనిది జరిగిందన్న మాట.

"ఏం జరిగింది" ప్రశ్నించాను.

కృష్ణకు ఏడుపు వచ్చింది.

"నా రెండు బుగ్గలూ పట్టుకున్నాడు. నన్ను కౌగిలించుకోబోయాడు రాస్కెల్. తాగి వున్నాడు డర్టీ రోగ్. నేను కోపంతో లాగి చెంప మీద కొట్టి వచ్చేశాను.. ఓల్డ్ ఫూల్...." ఏడుపు, కోపం ఆమెను వూపివేస్తున్నాయి.

బాస్ అంతపని చేశాడా?

నా నెత్తురు మరిగింది. ముసలి ముండాకొడుకు. నేను ప్రేమించిన కృష్ణ మీద వాడు చేతులు వేస్తాడా? వాడి చేతులు నరుకుతాను. వాడి గుండెలు చీలుస్తాను. వాడి గొంతు పిసుకుతాను.

ఆవేశంతో నా చేతులు బిగుసుకు పోయాయి. కోపంతో ఎర్రబడ్డ నా ముఖం చూసి కృష్ణ రెండు చేతులూ పట్టుకొని "రాజా! ప్లీజ్! కోపం తెచ్చుకోకు. ఎలా జరగవలసి వుంటే అలా జరుగుతుంది. బాస్ మీద ఏ అఘాయిత్యమూ చెయ్యకు. కొండను పొట్టేలు ఢీకొనలేదు." అంది.

బాస్ బలాన్ని, నా అసమర్థతనీ, అసహాయత్వాన్నీ గుర్తుచేసింది కృష్ణ.

"కృష్ణా!" అన్నాను వుద్వేగంతో.

"బాధపడకు రాజా! మనల్ని ఎవరూ వేరుచెయ్యలేరు. నీ కోసం నేను ఏమైనా చేస్తాను." నా కోపం తగ్గించడానికే అనుకుంటా కృష్ణ అలా అంది.

"సరే...." అని నేను వెళ్ళిపోయాను కృష్ణను వుద్యోగం నుంచి తొలగించే ఆర్డర్స్ తయారుచేయించడానికి.

* * *

కొన్ని రోజుల తర్వాత బాస్ ఒక రోజు బాగా తాగుతున్నాడు. నాకు



భయం వేసింది ఆ త్రాగుడు చూసి. సీసాలు సీసాలు త్రాగుతుంటే అది పొట్టా, చెరువా? అనిపించింది. డబ్బున్నవాళ్ళు ఇలా సీసాలకి సీసాలు త్రాగి ఏం ఆనందిస్తారో పాడు ఆనందం అనుకున్నాను. త్రాగితే ఏం ఆనందం వుంటుంది శవంలా పడి నిద్రపోవడం తప్ప!

"రాజా!" అన్నాడు బాస్.

"సార్!" అన్నాను.

బాస్ ముఖంచూస్తే నాకు అదోలా అనిపించింది. ఇంత డబ్బుంది, వయసు బడి వుండీ పెళ్ళిపెటాకులూ లేకుండా ఇలా బారుల్లో, త్రాగి త్రాగి బజారు ఆడవాళ్ళతో తిరిగి తిరిగి.... ఛీ.... ఏం బ్రతుకు?

"నువ్వొక సహాయం చెయ్యాలి నాకు," అన్నాడు.

నేను నివ్వెరపోయాను బాస్ మాటలు విని. నేను బాస్‌కి సహాయం చెయ్యడమా? డబ్బున్నవాడికి నేనేం సహాయం చేయగలను?

"నేనా....? నేను మీకు సహాయం చెయ్యాలా? అదేమిటి సార్! నేను మీ సెక్రటరీని. మీరు ఆజ్ఞాపించినట్లు చెయ్యడం నా డ్యూటీ. చెప్పండి సార్! నన్నేం చెయ్యమంటారో?" అన్నాను.

బాస్ నవ్వాడు.

"ఇది ఆఫీసు పని కాదు రాజా!"

నా గుండెల్లో రాయిపడింది.

'కొంపదీసి వీడు కృష్ణని తీసుకొచ్చి అప్పచెప్పమనడు గదా!'

నాకు పిచ్చెక్కిపోతోంది- గుండె వెయ్యిమైళ్ళ స్పీడులో కొట్టుకుంటోంది. నెత్తురు మరుగుతోంది.

"నాకు భార్యా పిల్లలు లేరు. నీకు తెలుసు గదా?" అన్నాడు.

కోపంతో నాకు మాటలు రావడం లేదు.

తల వూపాను తెలుసునన్నట్లు.

"నా ఆరోగ్యం దెబ్బతింటోంది రోజు రోజూకూ!"

'మరి గొంతువాకా తాగుతూవుంటే ఆరోగ్యం దెబ్బతినక తిన్నగా ఎలా వుంటుంది?' కసిగా అనుకున్నాను.

నా ఆస్థికి వారసుడు కావాలి ఇప్పుడు. నేను పోతే పిచ్చికుక్కల్లా కొట్టు కుంటారు నా బంధువులు."

నేను అర్థంకానట్లు వింటున్నాను. బాస్ ఇదంతా ఎందుకు చెప్తున్నాడు నాకు? ఈ వేదాంతం ఎవడికి కావా లిప్పుడు?

"నీకు తల్లిదండ్రులు లేరుగదా!"

తల వూపాను లేరన్నట్లు. నాకు గత మంతా గుర్తొచ్చింది. బాస్ నేను అనాథ శరణాలయంలో వున్నప్పుడు చాలా సహాయం చేశాడు. చదివించాడు తన డబ్బుతోనే. తెలివిగలవాడనని తన కంపెనీలో వుద్యోగం యిచ్చి తనకు సెక్రటరీగా చేసుకున్నాడు. బాస్ దేవుడు లాంటివాడు తనకి.

"రాజా! నువ్వు నా కొడుకులాంటి వాడివి నిన్ను నేను దత్తత చేసుకుందా మనుకుంటున్నాను."

నేను ఆశ్చర్యంలో మునిగిపోయాను. నా చెవులను నేనే నమ్మలేదు-నిజమేనా ఆయన అంటున్నది నన్ను దత్తత చేసుకుంటాడా? ఇంత ఆస్థిని.... ఈ కంపెనీని బంగళాలనీ, తోటల్నీ నాపరం చేస్తాడా!

ఆనందంతో నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సంతోషంతో చచ్చిపోతా నేమోననిపించింది.

బాస్ దేముడు నా దేముడు. ఆయన కాళ్ళకి మొక్కాలి నేను.

"అయితే నువ్వు కృష్ణను పెళ్ళి చేసుకోవాలి," అన్నాడు బాస్

అంతే. నేను రాతిలా స్థంభించి పోయాను కాసేపు.

నాకు అర్థమైంది బాస్ ఆలోచన.

'ఓరి దుర్మార్గుడా!' అనుకున్నాను.

కృష్ణ తనకు లొంగలేదనే కోపంతో బాస్ పెద్ద నాటకం ఆడుతున్నాడు.

తనని దత్తు చేసుకుని ఇంటి కోడల్ని చేసుకుంటాడు. ఆ తర్వాత నన్ను ఏ లారీతోనో పైలోకానికి పంపేస్తాడు. కృష్ణని వెధవముండని చేసి ఇంటి కోడలు కాబట్టి ఎక్కడికి పోనివ్వకుండా తన కోరిక తీర్చుకుంటూ.... ....

"నో.... నో...." గట్టిగా అరిచాను.

బాస్ అదిరిపోయాడు నా కేకలు విని.

"ఏం...? ఎందుకని! నీకు ఇష్టం లేదా?" అన్నాడు.

"పెళ్ళాన్ని బాస్‌కి అప్పుడెప్పుడానికి ఎవరు ఇష్టపడతారు?" అన్నాను.

బాస్ నివ్వెరపోయాడు. అతని ముఖం పాలిపోయింది.

"ఏమిటి నువ్వనేది?" అన్నాడు.

నేను నాకసి అంతా వెళ్ళగక్కాను.

"నువ్వు దుర్మార్గుడివి - కృష్ణ నీకు లొంగలేదనే కోపంతో నాటకం ఆడుతున్నావు. నాకు తెలుసు నీ దురాలోచన. నీ ఆటలు సాగనివ్వను.... కృష్ణ నీకు దక్కదు...."

బాస్ అల్సేషన్ కుక్కలా లేచాడు సోఫాలోనుంచి. ఎగిరి నామీద పడ్డాడు. నా చెంపలు వాయించాడు నామూతి పగులగొట్టాడు. నా జుట్టు పట్టుకుని ఈడ్చి ఈడ్చి తన్నాడు.

బాస్‌కి అంత బలం వుందని నేను ఏనాడూ వూహించలేదు. నన్ను చితక బాదుతుంటే తప్పించుకోలేకపోయాను.

ఆఖరికి నన్ను బంతిలా విసిరేశాడు.

నేను తోటకూర కాడలా వడిలిపోయి ఒక సోఫాలో కూలబడిపోయాను.

"ఒరేయ్ డర్టీ రాస్కెల్! నిజం చెప్తున్నా వినరా. కృష్ణ నా కూతురు. నా రక్తంరా .... నా రక్తం పంచుకు పుట్టిన కూతుర్రా ....! నా స్వంత కూతుర్రా....!" బాస్ ముఖంమీద చేతులు పెట్టుకుని ఏడుస్తున్నాడు.

ఆశ్చర్యంతో నా మనసు మొద్దుబారి పోయింది. బాస్ వంక నివ్వెరపోతూ చూశాను.

"అప్పుడా! రాజా! నేను ఇరవై ఏళ్ళ క్రితం ఒక దిక్కుమాలినవాడిని. డిగ్రీ తప్ప ఏమీ లేదు నా చేతిలో. సుశీల నేనూ ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. సుశీల గర్భవతి అయింది. కాని వాళ్ళ నాన్న కుల భేదాన్ని ఒప్పుకోలేదు. నేను ఒక ఇంటర్వ్యూకి వెళ్ళివచ్చేసరికి సుశీలకు బలవంతంగా పెళ్ళిచేసి పంపేశారు. ఆ తర్వాత నాకు జీవితంమీద విరక్తి పుట్టి చచ్చిపోవాలనిపించింది. స్త్రీజాతిమీద అసహ్యం వేసింది. సుశీల నాతో గర్భవతిఅయి ఎవడినో ఎలా పెళ్ళిచేసుకుంది? అది నాకు అవమానంగా తోచింది. పిచ్చెక్కినట్లయింది. కొన్నాళ్ళు మెంటల్ హాస్పిటల్లో వున్నాను. తర్వాత బైటకి వచ్చాను. డబ్బు సంపాదించాను. పెళ్ళి చేసుకో దల్చుకోలేదు. సుశీల ఎక్కడ వుందో గూడా నాకు తెలియలేదు. నేను తెల్సుకో దల్చుకోలేదు. తర్వాత ఒకరోజు మన కంపెనీ స్టాఫ్‌లో నిల్చుని కనిపించింది సుశీల. నాకు కడుపులో ప్రేగు కదిలింది. వివరాలన్నీ అడిగాను. కృష్ణని కని సుశీల చనిపోయిందని తెలిసింది. కృష్ణ నా కూతురు .... సంతోషంతో ఒకరోజు కౌగలించుకోబోయాను. కృష్ణ అపార్థం చేసుకుంది. కృష్ణకు నా ఆస్థి మొత్తం ఇవ్వాలనిపించింది. కాని ఎలా? ఇప్పుడామె సంఘంలో శంకరయ్య కూతురుగా చలామణీ అవుతుంది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. నాకు తెలుసు మీరిద్దరూ ప్రేమించుకున్నారని...."

బాస్ వంక చూస్తూ నెమ్మదిగా లేచి వెళ్ళి ఆయన పాదాలు పట్టుకుని "బాస్ నన్ను క్షమించండి...." అని గొణిగాను.